క్లుప్తంగా

సబ్‌జైల్‌ను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి



వార్డులో ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షేయాజ్ ఖాన్

నర్సీపట్నం: స్థానిక సబ్‌జైల్‌ను సీనియర్ సివిల్ జడ్జి పి.షేయాజ్ ఖాన్ బుధవారం సందర్శించారు. ఖైదీలకు పెడుతున్న ఆహారపదార్థాలను తనిఖీచేశారు. ఖైదీలు ఉంటున్న వార్డులను పరిశీలించి, జైల్‌లో అందుతున్న సౌకర్యాలపై ఖైదీలను ఆరా తీశారు. ఎవరికైనా బెయిల్ పెట్టుకునే ఆర్థిక స్థోమత లేకపోతే ఉచిత న్యాయ సేవలు పొందవచ్చునని జడ్జి ఖైదీలకు సూచించారు.

సత్యనారాయణస్వామి సన్నిధిలో వార్షిక కల్యాణోత్సవం



శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వారు

నర్సీపట్నం: మున్సిపాలిటీ బలిఘట్టం ఉత్తరవాహిని ప్రాంతంలో వేంచేసిన శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో మే 2వ తేదీన వార్షిక కల్యాణోత్సవం నిర్వహిస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకులు రామం తెలిపారు. ఉదయం 8 గంటలకు స్వామి వారికి పంచామృతాభిషేకాలు, విశేషాలంకరణ ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటలకు అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం నిర్వహించడం జరుగుతుందని అర్చకులు రామం తెలిపారు. భక్తులు అందరూ విచ్చేసి స్వామి వారి కల్యాణాన్ని విజయవంతం చేసి, స్వామి తీర్థప్రసాదం స్వీకరించాలని కోరారు.

డీసీసీబీ వద్ద చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బ్రాంచి మేనేజర్ దుర్గాప్రసాద్

రావికమతం : వేసవి దృష్ట్యా బ్యాంక్‌కు వచ్చే వినియోగదారులు, స్థానిక ప్రజలకు దాహార్తిని తీర్చేందుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జ్ కె. మయూర్ అశోక్, బ్యాంక్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డి.వి.ఎస్ వర్మ ఆదేశానుసారం చలివేంద్రం ఏర్పాటు చేశామని బ్రాంచి మేనేజర్ దుర్గాప్రసాద్ తెలిపారు. మండల కేంద్రంలో డీసీసీబీ బ్యాంక్ వద్ద బ్రాంచి మేనేజర్ దుర్గాప్రసాద్, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, మండలంలో గల ఆరు సంఘాల సిబ్బందితో కలిసి బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ చలివేంద్రం మూడు నెలల పాటు ఉంటుందన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

మాకవరపాలెం : గ్రంథాలయాలతో ఎంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని గ్రంథాలయ అధికారి చంద్రకళ అన్నారు. వేసవి శిబిరాల్లో భాగంగా బుధవారం విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సమయాన్ని వృథా చేయకుండా గ్రంథాలయంలో ఉండే విలువైన పుస్తకాలు చదువుతూ జ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులకు వివరించారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట



స్వామివారిని దర్శించుకుంటున్న నాయకులు

చీడికాడ : తునివలస శివారు వింటిపాలెం గ్రామంలో బుధవారం నూతనంగా నిర్మించిన ఆలయంతో పాటు అభయాంజనేయస్వామివారి విగ్రహ ప్రతిష్ట అత్యంత ఘనంగా ముగిసింది. మూడురోజులుగా స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ క్రతువు జరుగుతుంది. స్వామి వారిని ఎంపీపీ కురచా జయమ్మ, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి కొండబాబు, చీడికాడ, దేవరాపల్లి మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు గొల్లవిల్లి రాజుబాబు, బూరె బాబురావు, తునివలస సర్పంచ్ దంపతులు పడాల హైమాశ్రీను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువాతో సత్కరించారు.

వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు

- మోస్తరు వర్షాలతో ఆకు, కాయగూరలకు మేలు
- మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మి



పంటభూముల్లో ట్రాక్టర్లతో దుక్కులు చేసుకుంటున్న రైతులు

రోలుగుంట : మండల రైతులు వేసవి దుక్కుల పనుల్లో నిమగ్నం అయ్యారు. అందుకు తగ్గట్టుగానే మండల వ్యవసాయాధికారి రైతులకు అన్ని రకాల సూచనలు చేస్తున్నారు. మండలంలో సమారుగా ప్రతి ఏడాది 4,500 ఎకరాల పైబడి ఖరీఫ్‌లోను, వర్షాధార మండలం కావడంతో రబీలో నీటి వసతి ఉన్న గ్రామాల్లో సుమారుగా వరి 150 ఎకరాల్లో సాగవుతుంది

ఖరీఫ్ కోతలు విరామానంతరం ఈ వేసవిలో రైతులు లోదుక్కులు చేసుకోవాలని వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి సూచించారు. దీనివల్ల భూములో ఉన్న క్రిమి కీటకాలు పూర్తిస్థాయిలో నశిస్తాయన్నారు. రైతులు ప్రస్తుత యాంత్రిక సాగు విధానానికి అలవాటు పడి ట్రాక్టర్ల దుక్కికి అలావాటు పడ్డారని, అయినా నాగలితోనే లోదుక్కులు అనుకూలమన్నారు.

అడపాదడపా వర్షాలకు పంట భూములు దుక్కులు చేసుకొని పప్పుధాన్యాలు (మినుము, పెసర, బొబ్బర్ల విత్తనాలు చల్లుకోవాలన్నారు. కాయగూరలు, ఆకుకూరలు కూడా పండించుకోవచ్చన్నారు. దీనివల్ల భూమి గుల్లబారి, నీటిని నిల్వ కెపాసిటీ పెరుగుతుందన్నారు. భూమి సారవంతంగా కూడా తయారవుతుందన్నారు. ఆకు, కూరగాయల సాగువల్ల అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు.

ఈ-పంట విధిగా నమోదు చేయాలి



సాగు చేసుకుంటున్న పంటలను విధిగా ఈ పంట నమోదు చేసుకోవాలి. ఈ-పంట డేటాను అన్ని పథకాలకు, అలాగే ఎరువుల సరఫరాకు కూడా అనుసంధానం చేయడం జరుగుతుంది కాబట్టి రైతులు గమనించాలి. రైతులు వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించి భూసార పరీక్షలు చేయించుకోవాలి.

– ఎస్.విజయలక్ష్మి, మండల వ్యవసాయాధికారి

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి వీడ్కోలు సత్కారం



ప్రభుదాస్ విజయకుమారి దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, ఏవో తదితరులు

నాతవరం : ప్రజల మన్ననలు పొందేలా ప్రతి ఉద్యోగి పనిచేస్తే సమాజంలో ఎల్లప్పుడూ గౌరవిస్తారని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. మర్రిపాలెం ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కె.ప్రభుదాస్ బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభకు మండల వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు, సహచర ఉద్యోగులు విచ్చేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుదాస్ మాస్టారు పనిచేసిన ప్రతి పాఠశాలలో స్థానికంగా గ్రామస్తుల నుంచి మంచి ఆదరణ పొందారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంటు పార్థసారథి, ఎంఈవోలు సత్యనారాయణ వరహాలబాబు, విశ్రాంత ఎంఈవో అమృతకుమార్, రోలుగుంట ఎంఈవో జాన్‌ప్రసాద్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు కూండ్రపు సత్యనారాయణ, అప్పన్నబాబు, శెట్టి సుబ్రమణ్యం, మాజీ ఎంపీపీ విజయకుమార్, మాజీ సర్పంచ్ స్వామినాయుడు పలు పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంగునాయుడు

కె.కోటపాడు : ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులపై అవగాహన కలిగి ఉండాలని ఎ.కోడూరు సమీకృత వసతి గృహాధికారి పి.గంగునాయుడు అన్నారు. కె.కోటపాడులో గల రెల్లిపేటలో బుధవారం సివిల్ రైట్స్‌డే కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలంతా కుల వివక్ష లేకుండా ఐకమత్యంతో నడవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల వారికి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహం సద్వినియోగం చేసుకొని ఉన్నత ఉద్యోగాలను సాధించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వై.భవానీ, రెవెన్యూ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ సీహెచ్.జ్యోతి ప్రియాంక, వీఆర్వో జగదీష్ పాల్గొన్నారు.

ఘనంగా జ్ఞానమల్లేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

కె.కోటపాడు : గొండుపాలెం గ్రామంలో గల జ్ఞానమల్లేశ్వరస్వామి 17వ ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం గ్రామస్తులు ఘనంగా జరిపారు. స్వామి వారి ఆలయంలో పూజా కార్యక్రమాలు జరిపేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వార్షికోత్సవ పర్వదినం సందర్భంగా ఆలయంలో శివపార్వతుల కల్యాణం జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

సందడిగా స్వామివారి పెళ్లిరాట


ఘనంగా వెంకన్న వార్షిక కల్యాణోత్సవాలు ప్రారంభం



పెళ్లి రాట వేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు, అధికారులు

చోడవరం : శ్రీ ఆపదహర శ్రీనివాస క్షేత్రంగా బాసిల్లుతున్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక, స్వామివారి కల్యాణోత్సవాలకు భారీ ఏర్పాట్లు చేశారు. మే 8వ తేదీన శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీనివాసుని కల్యాణోత్సవాలు వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారి పెళ్లి రాట బుధవారం వేసి ఉత్సవాలను ప్రారంభించారు. చోడవరం కోఆపరేటివ్ కాలనీలో వేంచేసి యున్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పెళ్లిరాట వేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు శాంతారామచార్యులు, వాసు ఆధ్వర్యంలో వేదపండితులు మంత్రోచ్ఛరణ మధ్య స్వామివారి పెళ్లిరాట వేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ వింజుమూరి శంకర్, దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వివి సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉపాధ్యాయుల శ్రీనివాస్, సకురు కోటేశ్వరరావు, దేరవపల్లి వెంకటఅప్పారావు పాల్గొన్నారు.

సమాచార సేకరణతోనే గ్రామాభివృద్ధి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థినులు

రావికమతం : కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వ్యవసాయ కళాశాల విద్యార్థులు బుధవారం మత్స్యవానిపాలెం గ్రామంలో సమాచార సేకరణ పటంతో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ రాజ్‌కుమార్ పర్యవేక్షణలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బీఎస్సీ విద్యార్థులు రైతులకు ఆధునిక వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణల గురించి వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

విధి నిర్వహణలో మీ సేవలు స్ఫూర్తిదాయకం



ఏవో సూర్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న ఆర్డీవో రమణ, తహసీల్దార్లు



డిప్యూటీ ఎంపీడీవో నూకరాజును సన్మానిస్తున్న తహసీల్దార్ నాగమ్మ, ఎంపీడీవో నాగేశ్వర్రావు

నర్సీపట్నం : రెవెన్యూశాఖలో మచ్చలేని అధికారిగా ఏవో సూర్యనారాయణ ముద్ర వేసుకున్నారని ఆర్డీవో వి.వి.రమణ పేర్కొన్నారు. నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం ఏవోగా పని చేస్తూ బుధవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ అసోసియేషన్ సూర్యనారాయణ దంపతులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. రెవెన్యూ ఇంత నిబద్ధత కలిగిన వ్యక్తి ఎవరూ ఉండరన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం తహసీల్దార్ రామారావు, కలెక్టరేట్ ఏవో రత్నం, అసోసియేషన్ ప్రతినిధులు చైన్లు, సోమశేఖర్ పాల్గొన్నారు.

రోలుగుంట : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈవోపీర్డీగా విధులు నిర్వహించి, ఇటీవలే డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి పొంది బుధవారం పదవీ విరమణ చేసిన నూకరాజును ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పోతల లక్ష్మీ శ్రీనివాస్, తహసీల్దార్ నాగమ్మ, ఎంపీడీవో నాగేశ్వర్రావు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, నూకరాజును శాలువాతో ఘనంగా సత్కరించారు.

బండికాదు.. మొండి ఇది...

- మొరాయిస్తున్న ఆర్టీసీ బస్సులు
- ప్రయాణికుల ఇక్కట్లు



ఆగిన ఆర్టీసీ బస్సును నెట్టుతున్న ప్రయాణికులు

నర్సీపట్నం : ఆర్టీసీ బస్సులు ఎక్కడికక్కడ మొరాయిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఐదు రోజుల క్రితం చింతపల్లి నుంచి ప్రయాణికులతో వస్తున్న నర్సీపట్నంకు చెందిన ఆర్టీసీ అర్‌అండ్‌బీ కార్యాలయం వద్ద మొరాయించింది. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. బుధవారం నర్సీపట్నం డిపో నుంచి ప్రయాణికులతో బయలుదేరిన అనకాపల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు పెదబొడ్డేపల్లి వద్ద మొరాయించింది. ఎంతకు సెల్ఫ్ ఆన్ కాకపోవడంతో ప్రయాణికులు బస్సు దిగి నెట్టినప్పటికీ స్టార్ట్ కాలేదు. చేసేది లేక ప్రయాణికులను వేరే బస్సులో ఎక్కించారు. ఆర్టీసీ బస్సులు మార్గమధ్యంలో మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎల్‌ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారమే ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న గణపతిరావు

చోడవరం : పాలసీదారుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా లైఫ్ ఇన్సూరెన్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(లియాఫీ) పని చేస్తుందని లియాఫీ ఆల్ ఇండియా సెక్రటరీ జనరల్, ప్రస్తుత డీఆర్పీ పొలిటికల్ లైజనింగ్ అధికారి గణపతిరావు స్పష్టం చేశారు. చోడవరం బ్రాంచ్ లియాఫీ 11వ సర్వసభ్య సమావేశం చోడవరంలో బుధవారం జరిగింది. గణపతిరావు మాట్లాడుతూ ఎల్‌ఐసీ ఏజెంట్లకు కమీషన్ పెంచాలని, పాలసీదారులకు బోనస్‌ను ఇవ్వాలని కోరారు. విశాఖపట్నం డివిజన్ లియాఫీ ప్రెసిడెంట్ తిరుమలరావు, బ్రాంచి సీనియర్ ఏజెంట్లు సురేష్‌కుమార్, చండీశ్వరరావు, లాలం శ్రీనివాసరావు, సీనియర్ బ్రాంచి మేనేజర్ ఐ.శ్రీనివాసరావు, ఏబీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలు

కె.కోటపాడు : ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవల్లో భాగంగా గ్రామాల్లో ప్రజల చెంతకే వెళ్లి వైద్యం అందించనున్నట్టు లంకవానిపాలెం పీహెచ్‌సీ పీహెచ్ఎన్ ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో గల చిరికివానిపాలెం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. 106 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. బీపీ, సుగర్ పరీక్షలతో పాటు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేశారు. వైద్య శిబిరానికి రాలేని నలుగురు ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కుమారి పాల్గొన్నారు.

నిధుల కేటాయింపుపై రగడ

- బెల్టు షాపులను అరికట్టాలి
- రాయి లోడు లారీలను నియంత్రించాలి
- వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం



నిధులు కేటాయింపు విమర్శ, ప్రతి విమర్శ చేసుకుంటున్న వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ, టీడీపీ కౌన్సిలర్ పద్మావతి



కౌన్సిల్‌ను ఉద్దేశించి మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి

నర్సీపట్నం : మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నిధులు కేటాయింపుపై వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకుల మధ్య రగడ చోటు చేసుకుంది. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలు కాలంలో స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు సహకారంతో మున్సిపాలిటీకి రూ.26 కోట్లు తీసుకువచ్చామని టీడీపీ కౌన్సిలర్ సిహెచ్.పద్మావతి పేర్కొనడంపై మున్సిపల్ వైస్‌చైర్మన్ కోనేటి రామకృష్ణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా రాజకీయాలతో సంబంధం లేకుండా 15వ ఆర్థిక సంఘం నిధులు వస్తాయన్న విషయాన్ని టీడీపీ కౌన్సిలర్ పద్మావతి గుర్తించాలని రామకృష్ణ అన్నారు. రూ.14 కోట్ల ఆర్థిక సంఘం నిధులను స్పీకర్ తెచ్చారనడంలో అర్థం లేదని వైస్‌చైర్మన్ బదులిచ్చారు. దీంతో నిధులు కేటాయింపుపై టీడీపీ కౌన్సిలర్, వైస్‌చైర్మన్ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి కల్పించుకుని వీధి కుక్కలను నియంత్రించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పనితీరుపై చైర్‌పర్సన్ అసహనం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ సిరసపల్లి నాని, జనసేన కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య, టీడీపీ కౌన్సిలర్ శ్రీకాంత్ బెల్ట్‌షాపులు, ట్రాఫిక్ సమస్యలను ప్రస్తావించారు.

బెల్ట్‌షాపులు నియంత్రించాలి

మున్సిపాలిటీలోని ప్రతి పాన్‌షాప్‌లో మద్యం బెల్ట్ షాపులు నడుపుతున్నారని, చీకటి పడితే వీధుల్లో మహిళలు, ట్యూషన్‌కు వెళ్లే విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ నాని సభలో ఉన్న ఎస్ఐ ఉమామహేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. విచ్చలవిడిగా బెల్టుషాపులు నడుపుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. బెల్టుషాపుల వల్ల ఏదైనా సంఘటన జరిగితే పోలీసులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. బెల్టుషాపులు నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బదులిచ్చారు. సాధారణ వాహనాల కంటే నర్సీపట్నం మున్సిపాలిటీ రోడ్డుపై రాయి లోడు లారీలు అధికంగా తిరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ నాని, జనసేన కౌన్సిలర్ సౌజన్య కౌన్సిల్ దృష్టికి తీసుకువెళ్లారు. నిర్దిష్ట సమయం లేకుండా రాత్రి, పగలు రాయి లారీలు తిరుగుతున్నాయని, వీటి వల్ల ట్రాఫిక్ సమస్య వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్లు పేర్కొన్నారు. 50 టన్నుల లోడుతో వెళ్తున్న లారీల నుంచి రాయి జారిపడితే ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతాయన్నారు. ఎందుకు లారీలపై చర్యలు తీసుకోలేదని పోలీసులను ప్రశ్నించారు. గుర్రాల రోడ్డు శివారు ప్రాంతంలో బహిరంగంగా మద్యం సేవిస్తున్నారని, ఈ ప్రాంత ప్రజలు భయపడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ కౌన్సిలర్ శ్రీకాంత్ పోలీసులను కోరారు. ఈ అంశాలను సీఐ గోవిందరావు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్ఐ బదులిచ్చారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం అన్నారు. డీఈ త్రినాథ్ సమాధానం ఇస్తూ సభ్యులు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. సమావేశంలో కమిషనర్ జంపా సురేంద్ర, వివిధ విభాగాల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేటి నుండి వేసవి క్రీడా శిబిరం



బాక్సింగ్‌లో మెలకువలు నేర్పుతున్న కోచ్ అబ్బు

నర్సీపట్నం : ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం నుండి వేసవి క్రీడా శిబిరం ప్రారంభిస్తున్నామని శాప్ కోచ్ కె.అబ్బు తెలిపారు. బుధవారం స్టేడియంలో కొంతమంది చిన్నారులకు ఆయా క్రీడల్లో మెలకువలు నేర్పించారు. వుషు, బాక్సింగ్, తైకాండో, కరాటే, యోగ, వెయిట్ లిఫ్టింగ్, వాలీబాల్ క్రీడల్లో ఉచితంగా ప్రత్యేక శిక్షణ పొందవచ్చని కోచ్ తెలిపారు. 8 నుంచి 14 ఏళ్ల గల విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు.

సత్యసాయి ధ్యాన మందిరం ప్రారంభోత్సవం నేడు

దేవరాపల్లి: దేవరాపల్లిలో నూతనంగా నిర్మించిన భగవాన్ సత్యసాయి బాబా దివ్య ధ్యాన మందిరం ప్రారంభోత్సవాన్ని గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రైవాడ గ్రామానికి వెళ్లే రోడ్డులో దాతల సహాయ సహకారాలతో ఈ మందిరాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా భగవాన్ సత్య సాయి చిత్రపటంతో బుధవారం సాయంత్రం గ్రామ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ ఊరేగింపు వైభవంగా సాగింది.

శ్మశానవాటిక అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సత్యం, సర్పంచ్ చింతల

దేవరాపల్లి: ఎ. కొత్తపల్లి శ్మశానవాటిక స్థలంలో దహన వాటిక, ప్రహరీ గోడ నిర్మాణానికి ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం బుధవారం భూమి పూజ చేశారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ నిర్మాణ పనులు చేపట్టనున్నట్టు సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ తెలిపారు. త్వరలోనే ఈ నిర్మాణ పనులు పూర్తి చేసి గ్రామంలో శ్మశాన వాటికను అభివృద్ధి చేయనున్నట్టు సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సరువునాయుడు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయానికి మినీ ఫ్రిజ్ బహూకరణ

మాడుగుల రూరల్ : కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయానికి దాతల సహకారంతో మినీ ఫ్రిజ్‌ను బుధవారం అందజేశారు.గ్రామానికి చెందిన పుట్టా సూర్యారావు, బుచ్చెమ్మ, నానాజీ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రవి, చిన్ని, పవన్ సమకూర్చిన ఫ్రిజ్‌ను ఆలయ కమిటీ అధ్యక్షుడు అమ్మతల్లినాయుడుకు అందజేశారు.

వర్షంతో చల్లబడ్డ వాతావరణం

నర్సీపట్నం : నర్సీపట్నంలో బుధవారం మధ్యాహ్న సమయంలో ఒక్కసారిగా వాతావరణ చల్లబడి, ఆకాశం మేఘావృతమైంది. ఈదురు గాలులకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి గంటల వరకు విద్యుత్ సరఫరా లేదు. ఉక్కపోతతో అల్లాడిన ప్రజానీకం కురిసిన వర్షానికి ఊపిరి పీల్చుకున్నారు.

కె.కోటపాడు : పది రోజులుగా వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో తీవ్ర ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ ప్రజలకు బుధవారం కురిసిన వర్షంతో సేదతీరారు. ఇటీవల వేసిన చెరకునాట్లకు, వేసవి దుక్కులు నిర్వహించుకునేందుకు వర్షం ఉపయోగకరంగా ఉంటుందని రైతులు పేర్కొన్నారు.

గొలుగొండ : మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంట పాటు కురిసిన వర్షం కారణంగా పంట పొలాలు నీటితో నిండిపోయాయి. ఈ వర్షం వల్ల మెరక పంటలకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

మాడుగుల రూరల్: ఈదురు గాలులుతో కూడిన భారీ వర్షం బుధవారం మధ్యాహ్నం కురిసింది. ఈ వర్షంతో ఖరీఫ్ వరి నారుమడులు సిద్ధం చేయడానికి రైతులు సిద్ధ అవుతున్నారు. గత వారం రోజులుగా ప్రతి రోజు సాయంత్రం ఆకాశం మేఘావృతంగా వుండి వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. ఈ వర్షంతో ఖరీఫ్ వరి నారుమడులు సిద్ధం చేయడానికి వేసవి దుక్కులు దున్నుతున్నారు. ఈ వర్షం చెరకు కార్సి తోటలకు ఉపయోగకరమని రైతులు తెలిపారు.

మంగళాపురం ఆనకట్టకు డెయిరీ నిధులు



మంగళాపురం ఆనకట్టను పరిశీలిస్తున్న ఆనంద్‌బాబు

బుచ్చెయ్యపేట : మండలంలో గల మంగళాపురం ఆనకట్టకు విశాఖ డెయిరీ నిధులు ఖర్చు చేస్తామని డెయిరీ చైర్మెన్ ఆడారి ఆనంద్‌బాబు తెలిపారు. బుధవారం రైతు సంఘ నాయకులతో కలిసి ఆయన మంగళాపురం ఆనకట్టను పరిశీలించారు. ఆనకట్ట గండి పడడంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారు రూ.40 లక్షలతో ఆనకట్ట నిర్మాణ పనులు జరిగాయి. బ్యాలెన్సింగ్ పనులు మిగిలిపోవడంతో రైతు సంఘ నాయకులు విశాఖ డెయిరీ చైర్మన్ దృష్టికి తీసికెళ్లారు. మిగిలిపోయిన నిర్మాణ పనులకు రూ, 8 లక్షలు డెయిరీ నిధులు మంజూరు చేస్తున్నట్టు ఆనంద్‌బాబు తెలిపారు. డైరెక్టర్లు గేదెల సత్యనారాయణ, సూర్యనారాయణ, పవన్ కుమార్ పాల్గొన్నారు.